# ఆవిష్కరణ

అరుగురు దినపత్రికల రిపోర్టర్లూ నే వెళ్ళేసరికే వచ్చేశారు. అంత పెద్ద ఆవిష్కరణ మహోత్సవం అవుతూ ఉంటే పత్రికా విలేకర్లు అందరి కన్నా ముందు రావటం సముచితంగానే ఉంది. ఐతే వేళకి వచ్చిన మొట్ట మొదటి ప్రేక్షకుణ్ణి నేనే.

ఐదు నిముషాలు తక్కువ ఆరు అయ్యేసరికి గోల్డెన్ కఫేవాడి వేను ముగ్గురు సెర్వర్లతో సహా స్వీట్లు, హాట్లూ, ఫ్రూట్లూ, కాఫీ గంగాళం పట్టుకు వచ్చేసింది. గోల్డెన్ కఫే వాడా మరొకడా.

ఉపనాయకుడుగారు జైలు నుంచి విడుదల అయి వచ్చారు. వారు జైల్లో నాలుగువందల పేజీల ఉద్గ్రంథం రాశారు. జైలు నుండి బైటి కొచ్చిన వారం తిరక్కుండా గ్రంథాన్ని అచ్చు వేయించేశారు. గ్రంథా విష్కరణకి సభ ఏర్పాటు చేశారు. ఏభై అంటే ఏభై మందిని మాత్రమే సభకి ఆహ్వానించారు. పిలవబడ్డ వారంతా అతి ముఖ్యులు మాత్రమే. సభ ఏర్పాట్లు చూస్తున్న వాడు నాకో ఆహ్వానం ఇచ్చేశాడు. కాని గ్రంథకర్త అభిప్రాయం ప్రకారమైతే నాకు ఆ సభ ఆహ్వానితుల్లో ఉండడానికి అర్హత లేదు. ఆహ్వానితులే ఆ సభకి ప్రేక్షకులు. హాజరైన—ఆహ్వానితుణ్ణికాదు—ప్రేక్షకుణ్ణి నే నే!

ఆరుగురు ఉపన్యాసకులు ప్రత్యేకంగా పిలవబడ్డారు. అందులో రాజకీయాల్లో బహు పెద్దవాడు అధ్యక్షుడిగా, సాహిత్య రంగంలో మహా వృషభుడు ఆవిష్కరణకర్తగా పిలవబడ్డారు. మిగతా నలుగురూ ఒక్కొక్క రంగంలో ఉద్దండ పిండాలు. గ్రంథం మీదా గ్రంథకర్తమీదా ఉపన్యాసా లివ్వడానికి ఆహ్వానించబడ్డారు.

ఆరు అవుతూ వుండగా కారులో ఉపనాయకుడుగారు, అనగా ఉద్గ్రంథకర్తగారు వచ్చేశారు. సభాధ్యక్షులు కారులో దిగారు. ఉద్దండ

పెండాలు కారుల్లో దిగారు. అయితే మహావృషభుడు రాలేదు. తేలిన హంశ మేమంటే సాహితీకారుడు ట్రాముల్లో, బస్సుల్లో బంగురుకుంటూ నే నెక్కడ రాగలను అన్నాట్ట! వెంటనే గ్రంథకర్తగారు తమ కారు పంపిం చారు. మహావృషభుడు ఆయన దైనందిన అవసరాలకు సిటీబస్సుల్లో. ట్రాముల్లో, రెండు కాళ్ళతో రోడ్లంట నడుస్తూ కనబడుతూనే వుంటాడు. సభలో ఉపన్యాసకుడిగా పిలిచిన తరవాత కారు పంపి తీసికెళ్ళాలి. కారులో దిగబెట్టాలి. సభకి ఎవరైనా పిలిచిననాడు కారు యోగం పట్టాలి.

సభ ఆరుగంటలకి అనుకున్నారు కాని ఆరున్నరకి వృషభులు గ్రంథకర్తగారి కారులో ముసిముసి నవ్వులతో ఆడదానికన్నా ఎక్కువ టాయిలెట్ అయి దిగారు.

అక్కడికి ప్రెస్సు రిపోర్టర్లూ, ఆరుగురు ఉపన్యాసకులు, గ్రంథ కర్తగారూ రావడం అయింది. ప్రేక్షకుణ్ని నేనొక్కణ్ణి వచ్చాను. ఆహ్వా నితులు ఏభైమందిలో ఏ ఒక్కడూ రాలేదు. మహానగరం దూరాభారాలు ఎక్కువ. వేళకివచ్చే అలవాట్లు ఎవరికీ లేవు. అంచేత ఏడుదాకా చూద్దాం అనుకున్నారు.

ఏడు దగ్గరపడుతూ ఉంటే గ్రంథకర్తగారు మమ్మల్ని లోపలకు వెళ్ళి హాల్లో కూర్చోమన్నారు. రోడ్డుమీద నిలుచోడం ఎందుకని మంచిదని లోపలికి వెళ్ళాం.

హాలు అవతల వరండాలో కాఫీ పార్టీ ఏర్పాటు ఉంది. వచ్చినవాళ్ల కానియ్యండి అన్నారు. ఎవరి తిండి వాళ్ళు తినేశాం. కాఫీ తాగేశాం. పదా ర్థాలు ఫస్టుగా ఉన్నాయి. ఆరుగురు ఉపన్యాసకులు వాపిరిగొట్లలా తిన్నారు. ఉన్నవాళ్ళ తింటున్నవాళ్ళే. వాళ్ళకే ఉంటుంది వాపిరిగొట్టుతనం.

ఏడల్లా ఏడున్నరా అయింది. హాల్లోకొచ్చి కూర్చున్నాం. సభానం తరం ఒక గానకోకిలమ్మ గాత్రకచేరి ఉంది. వాళ్ళూ వచ్చారు. మాకన్నా ముందే తినవలసిందీ తినేసి హాల్లో వున్నారు. కోకిలమ్మ వెనక మృదంగం వయొలిన్. తంబూరాలు ఉన్నాయి. వాళ్ళు నలుగురు హాల్లో ఆసీనులై ఉన్నారు. అధ్యక్షులవారు సభ ప్రారంభం చేసేద్దాం అన్నారు. మధ్యని ఎవరైనావస్తే రావచ్చు దానికేం అన్నాడు.

సభా ప్రారంభం అయింది. సభ ఏర్పాటు చేస్తున్న ఆసామీ ఒకడు ఉన్నాడుకదా అతనందర్నీ వేదికమీదికి ఆహ్వానించాడు. గ్రంథకర్త అధ్యక్షుడు, ఐదుగురు ఉపన్యాసకులు ఎక్కేరు. వేదికమీద బడా కుర్చీలు అందరికీ లెక్కకట్టి ఉన్నాయి.

అందరికీ మెడ దగ్గరనుంచి మోకాళ్ళ దాకా వచ్చే బడా గులాబీల దండలు వేశారు. అందరి బుర్రలూ దండల్లో మునిగిపోయాయి. పువ్వుల్లో కూరుకుపోయాయి.

ఎదురుగా ప్రేక్షకులు లేకపోయినా వేదికమీద ఆవిష్కరణోత్సవం చూడముచ్చటగా జరిగింది.

అంతా చెప్పి, ముఖ్యమైంది మరచిపోయాను. ఫోటోగ్రాఫరు ఒకడు వచ్చాడు. ఎప్పుడొచ్చాడో ఎలాగొచ్చాడో నేను ఎరగను. ఫ్లేష్‌వేసి మొదటి ఫోటో తీసేదాకా నేను వాణ్ణి గమనించలేదు. వాడన్ని పక్కలా తిరుగుతూ చాలా క్లిక్ చేశాడు.

రాత్రి పదకొండు దాకా ఆవిష్కరణోత్సవం జరిగింది. మాట్లాడవలసిన వారంతా ఇంతో అంతో మాట్లాడారు. అందరి ఉపన్యాసాలు ప్రశంసలే. అందుకే వారు పిలవబడ్డారు. అందుకే వారొచ్చారు. ఉపన్యాసకుణ్ని వారి ఉద్గ్రంథాన్ని ఆకాశానికెత్తారు.

ఐతే వాస్తవంగా సభకి నేనొక్కణ్ణే ప్రేక్షకుణ్ణి! రిపోర్టర్లు ఆరుగురూ ప్రేక్షకులకింద జమ. గానకోకిలమ్మ ఆవిడ హంగుదార్లు ప్రేక్షకులకిందే లెక్క. అయినా ఉపన్యాసకులంతా వారి సహజ ధోరణిబట్టి ఎదురుగా వెయ్యిమంది ఉన్నట్టు కంఠస్వరాలు ఎత్తి హాలు దద్దరిల్లేలాగ ఉపన్యాసాలు దంచేశారు. ఒకణ్ణిమించిన వ్యక్తి ఇంకొకరేమో నేనెవరికీతీసిపోననే పద్ధతిని "నీ ఉపన్యాసం విన్నాను. విను నా ఉపన్యాసం" అంటూ ఉపన్యసించారు.

తరవాత గానకోకిలమ్మ కూజితం ఇరవై నిముషాలు పట్టింది.

పెద్దలందరికీ ఉపనాయకుడుగారు వారి స్వహస్తాలతో తలొకపుస్తకం ఇచ్చారు. ఒకేఒక్క ప్రేక్షకుణ్ణయిన కారణంచేతనేమో ప్రేక్షకులకి ఇవ్వడం ఏర్పాటులో లేకపోయినా నాకూ ఒక పుస్తకం బహుమానం చేశారు. పుస్తకం వెల రు. 36/-

ట్రాములూ, బస్సులూ ఆగిపోయాయి. నడిచి నాలుగుమైళ్ళు నేను ఇంటికి వెళ్ళవలసిందే. కాని బడా ఉపనాయకుడుగారు నా చిరునామా అడిగి నాకు దగ్గర ప్రాంతానికి పోతున్న ఒక ఉద్దండపిండంగారి కారులో ఇంటికి పంపించారు. ధన్యోస్మి!

ఆశ్చర్యం. మర్నాడు దినపత్రికల్లో పతాక శీర్షికలతో నాలుగు మూడు కాలములు విస్తరించి ఆవిష్కరణోత్సవం పడ్డాది. ప్రముఖుల ఉపన్యాసాలు, ఉద్గ్రంథం ఘనత ఆకాశానికి ఎత్తుతూ పడ్డాది. అది పడ్డ పేజీలమధ్య అవిష్కరణోత్సవం ఫోటోలు కూడా సలక్షణంగా పడ్డాయి. ఫోటోలకింద వివరాలు పడ్డాయి.

అంత పెద్ద పుస్తకం కొన్ని పేజీలైనా చదవవద్దా అనుకొంటూ చదవబోతే సారం పర్వాణి పర్వాణి అన్నట్టు పిప్పి పేజీపేజీకి పెరుగుతూ వచ్చింది. అతనా పుస్తకం రాయనక్కరలేదు. అచ్చువెయ్య నక్కరలేదు. అది కొంత చదివి ఇహ చదవడం అనవసరం అనే అభిప్రాయానికి వచ్చాను. ఐతే వేదిక మీద ఆకాశానికి ఎత్తుతూ ఉపన్యాసమిచ్చి, నన్ను మా ఇంటిదాకా దిగబెట్టిన ఉద్దండ పిండం తోవలో అదే మాట నాతో అన్నాడు! "వెధవచెత్త దాని మొహానికి అచ్చొటి! పైగా ఆవిష్కరణ! నాకు చాలా సంతోషంగావుంది. ప్రేక్షకులు రాలేదు!" ఉద్దండపిండంనాతో అన్న మాటలు!

ఏమండి మీరంత పొగిడేరే అని కాని నేనంటే రాజకీయాలు నీకు తెలియవా అంటాడు! అందుకే విని ఊరుకున్నాను.

పుస్తకం అచ్చు అయిన మూడునాలుగు నెలలు తిరక్కుండా అచ్చు వేసిన పుస్తకాలన్నీ చెల్లిపోయాయి. ఉద్గ్రంథకర్త అయిన ఉపనాయకుడి గారి దగ్గర పట్టున పది కాపీలు మిగలలేదు! దేశం మొత్తంమీద అన్ని లైబ్రరీలు తలో కాపీ కొన్నాయి. ఏ మారుమూల పట్టణంలో లైబ్రరీలో కెళ్ళినా ఈ గ్రంథం ఏదో ఓ బీరువాలో ఓమూల మూలుగుతూ అప్పణ్ణించి ఇప్పటిదాకా పడి ఉంటున్నాది. ఉద్గ్రంథకర్తగారు అసాధారణమైన డబ్బు చేసుకున్నారు!

గ్రంథానికి పాఠకులు లేరు. ఈ నా రచన చదివిన వారంతా మీమీ ఊళ్ళలో ఉన్న గ్రంథాలయానికి వెళ్ళి చూడండి. తప్పక ఆ గ్రంథం ఉంటుంది. తిరిగి మీ చేతుల్తో ఆవిష్కరించండి. ఆ గ్రంథానికి ఆవిష్కరణ అవసరం. అనేకవూళ్ళలో తిరిగి ఆవిష్కరింపబడ్డాది అనే ఘనత ఆ దిబ్బ పుస్తకానికి కలిగించండి. చదవనక్కరలేదు. ఆవిష్కరించండి. పుస్తకాన్ని కన్నులారా చూసి ఆవిష్కరణ చెయ్యండి.